# పరోపకారమే జీవిత పరమావధి

ప్రేమస్వరూపులారా! ఈనాడు మహిళా దినోత్సవమును పురస్కరించుకొని అనేకమంది ఆడవారు ఇక్కడ చేరి, ఎంతో ఆనందాన్ని అనుభవిస్తూ, తమ ఆనందాన్ని అందరికీ పంచుతూ వచ్చారు. అయితే, ఆడ, మగ అనే భేదము కేవలము ఉపాధిని బట్టి ఏర్పడిందిగాని, నిజానికి అందరియందు ఉన్నది బ్రహ్మతత్త్వమే. 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. దైవము కావాలని అందరూ కోరుతూ ఉంటారు. ఒక పర్యాయం నారదుడు శ్రీమన్నారాయణునివద్దకు వెళ్ళి, "స్వామీ! మీరు భూలోకంలో అవతరించి అందరికీ మీ దర్శనభాగ్యం అనుగ్రహించండి", అని ప్రార్థించాడు. ప్రాచీన కాలములో అనేకమంది ఋషులు, యోగులు దైవాన్ని దర్శించగోరి తపస్సు చేశారు. అయితే, దైవము ఎక్కడున్నాడు? 'దైవం మానుష రూపేణ'. మానవజాతిని సంరక్షించే నిమిత్తం దైవము మానవ రూపంలో అవతరిస్తూ వచ్చాడు.

**మీరందరూ దైవస్వరూపులే!**

భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపముగాని, గుణములుగాని లేవు. భగవంతుడు అనంతస్వరూపుడు. పాజిటివ్, నెగెటివ్ రెండింటి చేరికచేత కరెంటు ప్రసరించి మనకు వెలుతురు లభించినట్లుగా, దైవత్వమనే పాజిటివ్, జీవత్వమనే నెగెటివ్ రెండింటి చేరికతో మహాశక్తిమంతమైన అవతారముగా దైవము దిగి వస్తాడు. కనుక, అవతార పురుషుడు కేవలం బ్రహ్మస్వరూపుడే కాదు, మానవ స్వరూపుడుకూడా. దేవునితోపాటు జీవుడు, జీవునితోపాటు దేవుడు ఇరువురూ ఏకమై ఉంటారు. బ్రహ్మతత్త్వ మనేది అందరియందు అంతర్ముఖముగా ఉంటున్నది. 'ఈశ్వర స్సర్వ భూతానాం'. సర్వభూతములయందు ఈశ్వరత్వమెంటున్నది. ఈ జగన్నాటక రంగములో అన్ని పాత్రలను భగవంతుడే పోషిస్తున్నాడు. తానే సూత్రధారి, తానే పాత్రధారికూడా. భర్తగా కనిపించేదీ తానే,

sri sathyasai vachanamrutam

కుమారునిగా కనిపించేదీ తానే, కుమార్తెగా కనిపించేదీ తానే. 'ఈనాడు నాకు గ్రాండ్‌సన్ పుట్టాడు', అంటారు ఒకరు. అయితే, ఆ 'గ్రాండ్‌సన్' కూడా పరబ్రహ్మస్వరూపుడే! పుట్టిన ప్రతి జీవిలోనూ బ్రహ్మ లీనమై ఉంటాడు. దైవమునకు ప్రత్యేకించి ఒక రూపమనేది లేదు. రూపనామములు కేవలం జీవునికేగాని, దేవునికి లేవు. ఎవరియందు చూచినా దైవమే ఉన్నాడు. మీరందరూ దైవస్వరూపులే! దైవస్వరూపులైన మీరు సర్వత్రా దైవాన్నే చూస్తున్నారు. చూడండి, ఇక్కడ చిన్నచిన్న పక్షులు సంచరిస్తున్నాయి. ఈ పక్షులయందుకూడా దైవమున్నాడు. దైవము లేని స్థానము, దైవము కాని రూపము ఎక్కడా కనిపించదు. అయితే, భక్తుల మనోభావాలనుబట్టి వారిని సంతృప్తిపరచే నిమిత్తం భగవంతుడు ఆయా రూపనామాలను ధరిస్తుంటాడు.

'శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి' అనే ఎనిమిది బిరుదులున్నాయి భగవంతునికి. మనద్వారా మాట్లాడుతున్నది దైవమే! ఎవరైనా మనల్ని తిడితే, దైవమే తిట్టాడనుకుంటే మన మనస్సు ఏమాత్రం అలజడికి గురికాదు. 'దైవమే ఈ రూపములో వచ్చి నన్ను దూషించాడు', అనుకోవాలి. కొట్టినా, తిట్టినా అంతా దైవమే. ఏది జరిగినా అదంతా దైవమే జరిపిస్తున్నాడనే విశ్వాసాన్ని హృదయంలో దృఢం చేసుకోవాలి. ఎదుటి వ్యక్తిని పరాయి వ్యక్తిగా చూడకూడదు; దైవస్వరూపునిగా భావించాలి. అతను పరాయివాడని భావిస్తే మనలో కోపము, తాపము, ఈర్ష్య, అసూయ మొదలైన అనేక దుర్గుణాలు బయలుదేరుతాయి. అందరిలో ఉన్నది భగవంతుడే! ఈవిధమైన ఏకాత్మభావాన్ని అలవరచుకున్నప్పుడే మానవుడు ధన్యుడవుతాడు. మీరు ఎవరైనా మహనీయులవద్దకు వెళ్ళి, 'మాకేమైనా బోధించండి', అని అడిగితే, 'నాయనా! నిన్ను నీవు తెలుసుకో, చాలు' అని చెబుతారు. మీరు ఎదుటి వ్యక్తిని, 'ఎవరు నీవు? ఎక్కడినుండి వచ్చావు?' అని ప్రశ్నిస్తారుగాని, 'నేను ఎవరు? ఎక్కడినుండి వచ్చాను?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోరు. ఆ ప్రశ్న వేసుకున్నవారికే సరియైన జవాబు వస్తుంది. భగవంతుడే ఈ దేహమునిచ్చాడు. నోట పలికించేది తానే, నడిపించేది తానే, నవ్వించేది తానే, ఏడిపించేదీ

sri sathyasai vachanamrutam

తానే. కనుక, అంతా దైవసంకల్పమే అని భావించాలి.

**స్వార్థరహితమైన కోరికలకు స్వామి అఖండమైన ఫలితాన్ని అనుగ్రహిస్తారు**

ఈసందర్భంలో మనము ఈశ్వరమ్మయొక్క గుణగణములను గుర్తు చేసుకోవాలి. ఆమె ఎప్పుడూ సంతోషంగా ఉండేది. ఆమె హృదయము ప్రేమతో నిండినటువంటిది, మృదుమధురమైనది. ఒకరోజున ఆమె నాదగ్గరికి వచ్చి, 'స్వామీ! ఈ చిన్న పల్లెలో పిల్లలకు జ్వరం వస్తే పలుకరించేవారు లేరు. తల్లులు ఆ పిల్లలను ఎత్తుకొని ఏడ్చుకుంటూ బుక్కపట్నం ఆసుపత్రికి తీసికొని వెళుతున్నారు. అక్కడికి పోయినా సరైన మందు ఇవ్వరు. అందువల్ల, మన గ్రామంలోనే ఒక చిన్న హాస్పిటల్ పెట్టండి', అని కోరింది. 'ఇప్పుడు కాదమ్మా, దానికి తగిన సమయం వస్తుంది. దేనికైనా కాల, కర్మ, కారణ, కర్తవ్యాలు కలసి రావాలి' అని చెప్పాను. తప్పక ఆసుపత్రి కట్టిస్తానని మాటిచ్చాను.

మరొకరోజున ఈశ్వరమ్మ నాదగ్గరికి వచ్చి, 'స్వామీ! మన గ్రామంలో ఒక పాఠశాల లేకపోవడం వలన పిల్లలు బరువైన పుస్తకాల సంచీ మెడకు తగిలించుకొని బుక్కపట్నం స్కూలుకు నడుచుకుంటూ వెళుతున్నారు. పూర్వం మీరుకూడా బుక్కపట్నం స్కూలుకి నడిచే వెళ్ళేవారు కదా! ఈ పిల్లలు చదువు నిమిత్తం వేరే ఊరికి వెళ్ళే అవసరం లేకుండా మన గ్రామంలోనే ఒక చిన్న స్కూలు కట్టించండి' అని కోరింది. 'అవుతుంది, అవుతుంది. నీవు దీనిగురించి చింత చేయకు' అన్నాను.

ఆమె మళ్ళీ మరొక రోజున వచ్చి, "స్వామీ! మన గ్రామంలో ప్రజలకు సరియైన త్రాగునీటి సౌకర్యం లేదు. చిన్నచిన్న పిల్లలు బిందెలు తీసుకొని చిత్రావతికి వెళ్ళడం చూస్తుంటే నాకు ఏడుపొస్తుంది. అక్కడకూడా ఇసుక తోడితేగాని నీరు రాదు. చిత్రావతి జీవనది కాదు. ఎప్పుడో వర్షము వస్తే నీరు వస్తుంది, లేకపోతే లేదు. మనిషికి నీరే ప్రాణాధారము కదా! కనుక, మన గ్రామంలో ఒక బావి త్రవ్వించి నీటిసమస్య తీర్చండి' అని కోరింది. 'చూడు, నీ కోరికలు చాలా చిన్నవి. కాని, వీటిని నేను పెద్ద ఎత్తున నెరవేరుస్తాను. నీవు కోరినవన్నీ తెప్పిస్తాను. నీవేమీ చింతపెట్టుకోకు. మన గ్రామంలోని పిల్లలందరికీ చదువులు చెప్పిస్తాను, ఆరోగ్యము నందిస్తాను', అని చెప్పాను. ఆమెకు చెప్పినట్లుగా,

sri sathyasaivachanamrutam

పుట్టపర్తిలో ఒక స్కూలు కట్టించాను. ఐతే, ప్రారంభంలో 'పిల్లలు కొంతమంది మాత్రమే స్కూలుకి పోతున్నారే! అందరూ పోవడం లేదే!' అని అనుకుంది, ఈశ్వరమ్మ. కాని, క్రమక్రమేణ పిల్లలంతా వెళ్ళి చదువుకోవడం చూసి ఆమె ఎంతో ఆనందించింది. 'స్వామీ! నాకిప్పుడు సంతోషంగా ఉంది', అన్నది. తరువాత నేనిక్కడ కాలేజీ కట్టించాను. ఆ కాలేజీ యూనివర్సిటీ అయిపోయింది.

'స్వామీ! మన గ్రామంలో ఆసుపత్రికొరకు ఒక చిన్న గది కట్టించండి' అని అడిగింది, ఈశ్వరమ్మ. ముందుగా ఇక్కడ కొండపైన ఒక చిన్న హాస్పిటల్ కట్టించాను. సీతారామయ్య అందులో డాక్టరుగా పని చేసేవాడు. ఆయనది తూర్పు గోదావరి జిల్లా. ఇక్కడికి వచ్చేయమని చెప్పాను. ఆయన మంచి భక్తుడు. నా ఆదేశం మేరకు ఇక్కడికి వచ్చి చివరివరకు ఇక్కడే ఉండి సేవ చేశాడు. ఈవిధంగా ఒక డాక్టరు, ఇద్దరు నర్సులతో హాస్పిటల్ ప్రారంభమైంది. అదే ఇప్పుడు పెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అయింది. ఆనాడు ఈశ్వరమ్మ కోరినదానికంటే నేను అధికంగా చేశాను.

ఆరోజుల్లో ఒక పర్యాయం నేను చిత్రావతీ నదికి వెళ్ళినప్పుడు, ఆడవారు ఇసుకను త్రవ్వి, కొద్దిగా నీరు ఊరితే ఆ నీటిని తెచ్చుకోవడం చూశాను. తరువాత ఈశ్వరమ్మకూడా, 'స్వామీ, నీటికి ఏమైనా అనుకూలం చేయండి', అని ప్రార్థించింది. అప్పుడొక బావి త్రవ్వించాను. ఇప్పుడు వందలాది మైళ్ళ దూరం నుండి పైపులద్వారా అనంతపురం జిల్లాకు నీరు తెప్పించాను. ఈరీతిగా, ఈశ్వరమ్మ కోరినవన్నీ నేను నెరవేర్చాను. ఆమె పరోపకారం కోసమే ప్రార్థనలు చేసిందిగాని, ఏనాడూ తన స్వార్థంకోసం చేయలేదు. స్వార్థం లేకుండా ఏ చిన్న కోరిక కోరినా దానికి అఖండమైన ఫలితాన్ని అనుగ్రహిస్తారు, స్వామి. చిన్న స్కూలును పెద్ద యూనివర్సిటీగా చేశాను. చిన్న బావిని బ్రహ్మాండమైన నీటి పథకంగా సృష్టించాను.

ఆరోజుల్లో పుట్టపర్తితోపాటు చుట్టుప్రక్కల వున్న గ్రామాలకుకూడా కరెంటు సప్లై చేయించాను. ఐతే, ఏది చేసినా నా ఇష్టమును అనుసరించి కాక ఇతరుల అవసరాలను తెలుసుకొని వారిని సంతృప్తిపరుస్తూ వచ్చాను. మీరే చూడండి, ఇంత పెద్ద హాలులో ఇంత మంది కూర్చొనగల్గుతున్నారంటే, ఇది ఎవరికోసం కట్టించాను? నాకోసమా?! 'పరోపకారః

పుణ్యాయ పాపాయ పరపీడనం'. ఇది చాలా ముఖ్యమైనది. 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్'. అందరికీ 'హెల్ప్' (సహాయం) చేసుకుంటూ పోవాలిగాని, కేవలం మీ 'సెల్ఫ్' (స్వార్థం) కోసం ప్రాకులాడకూడదు. Fish is better than selfish. కాని, ఈనాడు స్వార్థం మితిమీరిపోయింది. ఈ రాజకీయాలు ఎక్కడినుండి వచ్చాయోగాని, వీటివలన ప్రపంచమంతా దుర్గుణాలు ప్రాకిపోతున్నాయి. రాజకీయాలు లేకపోతే అందరూ సుఖిస్తారు. అసలు రాజకీయమంటే ఏమిటి? దీని అర్థాన్ని గుర్తించి వర్తించాలి. కాని, ఈనాడు ఎవ్వరూ గుర్తించడం లేదు. ఉపకారము చేయవలసినవారికి అపకారము చేస్తున్నారు. కనుక, మీరు రాజకీయాలకు దూరంగా ఉండండి. మీ స్వశక్తిపైన ఆధారపడండి. దైవముపై మీరు ఆధారపడండి. దైవముపై ఆధార పడినప్పుడు అందరి మనస్సులనూ మీకనుకూలంగా తాను త్రిప్పుతాడు. God is everything. దైవముపై ఆధారపడినప్పుడే మీరు విజయాన్ని పొందుతారు.

**మీ హృదయాన్ని దైవభావాలతో నింపుకోండి**

దేనినీ మీకోసమై మీరు ఆశించకూడదు. స్వార్థాన్ని విడిచిపెట్టకపోతే మీరు ఇతరులకు 'హెల్ప్' చేయలేరు. పదిమందికి ఉపకారము చేయాలనే భావన మీలో రావాలి. సద్గుణములను పెంపొందించుకోవాలి. త్యాగ మయమైన పని చేయాలి. అందుకోసమే, 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన', అని చెప్పింది భగవద్గీత. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించండి. మీకు ఏది కావలసినా స్వయంగా ప్రయత్నం చేయండి. స్వశక్తిపై ఆధారపడి మీ జీవితాన్ని, మీ కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దుకోండి. మీ కుటుంబము అభివృద్ధికి రావాలంటే, మీ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు కావాలంటే దైవాన్ని ప్రార్థించండి. మీ హృదయాన్ని దైవభావాలతో నింపుకోండి. మీ 'హార్టు'ను విశాలం చేసుకోండి. ఇక్కడ 'హార్టు' అంటే అర్థం గుండె కాదు. గుండె పెద్దదవుతే అదొక జబ్బుగా బయల్దేరుతుంది. ఇక్కడ 'హార్టు' అంటే హృదయం అని అర్థం. ఇది అందరియందు ఉంటున్నది. భగవంతుణ్ణి 'హృదయవాసి' అని పిలుస్తున్నాము. ఈ హృదయాన్ని మనం విశాలం గావించుకోవాలి. అప్పుడే మనలో విశాలమైన భావాలు ఆవిర్భవిస్తాయి. హృదయం సంకుచితమైతే అన్నీ

sri sathyasaivachanamrutam

చిల్లరబుద్ధులే వస్తుంటాయి. అటువంటి 'చీప్ క్వాలిటీస్'కు మనం అవకాశమివ్వకూడదు.

**ప్రేమను పెంచుకోండి**

మానవజన్మ అత్యంత పవిత్రమైనది. 'దైవం మానుష రూపేణ' అన్నారు. కనుక, పవిత్రమైన హృదయం కలిగిన మానవులుగా మీరు తయారు కావాలి. నేను ఉపన్యాసాలు ఇవ్వడంగాని, భజనలు చేయించడంగాని మీ హృదయం విశాలం కావాలనే! తెల్లవారుఝామున నగర సంకీర్తనలో పాల్గొన్నప్పుడు మీ హృదయం ఉప్పొంగుతుంది. మీ తృప్తికోసం మీరు ఏవో కీర్తనలు పాడుకుంటే సరిపోదు; విశాలమైన భావంతో సంకీర్తన చేయాలి. ఆనందాన్ని కేవలం మీరొక్కరే అనుభవించకుండా పదిమందికి పంచాలి. నామామృతాన్ని అందరికీ పంచితే హృదయం ఎంతో ఉప్పొంగిపోతుంది. మీరు ఏది చెప్పినా, ఏది చేసినా, ఏది చూసినా హృదయం విశాలం కావాలి. అప్పుడే 'మానవుడు' అనే పేరు మీపట్ల సార్థకమవుతుంది. హృదయాన్ని విశాలం గావించుకొని పెద్ద మనసుతో ప్రజలందరికీ ఆనందాన్ని పంచండి. కాని, ఈనాటి మానవులు తమ హృదయాన్ని పవిత్రం గావించు కొనకుండా, తమలో ఉన్న దోషాలను కప్పిపెట్టి పైకి పెద్దలుగా నటిస్తున్నారు. 'నా కుటుంబం మాత్రమే క్షేమంగా ఉండాలి, సిరిసంపదలతో తులతూగాలి' అని ఆశిస్తున్నారు. ఇది చాలా చెడ్డది. మీవలె ప్రజలందరూ కోరుకుంటారు కదా! మీకుండే కోరికలు వారికికూడా ఉంటాయి కదా! 'కేవలం నేను, నా భార్యాబిడ్డలు, నా బంధుమిత్రులు మాత్రమే క్షేమంగా ఉండాలి', అనే సంకుచితమైన భావానికి మీరు అవకాశమివ్వకూడదు. అందరూ ఒక్కటిగానే ఉండాలి. అదెట్లా సాధ్య మవుతుంది? 'అందరియందు నా దేవుడే ఉన్నాడు. దేవుడు లేక నేనుండడానికి వీలుకాదు' అనే దృఢమైన విశ్వాసమును మీరు పెంపొందించుకోవాలి. సర్వకాల సర్వావస్థలయందు భగవచ్చింతన గావించాలి. 'నాకు కలిగిన బాధ ఎవ్వరికీ కలుగకూడదు. నావలె ఇతరులు బాధపడకూడదు. అందరూ సంతోషంగా ఉండాలి. అందరూ అభివృద్ధికి రావాలి' అనే విశాలమైన దృక్పథాన్ని కలిగియుండాలి. దీనికంతటికీ ఆధారం ప్రేమ ఒక్కటే. కనుక, ప్రేమను పెంచుకోండి.

– శ్రీవారి దివ్యబోధ, తేదీ 19.11.2005, మహిళా దినోత్సవం

sri sathyasai vachanamrutam